# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నక్సలిజం నుండి విముక్తి పొందిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- కర్బన్ ఉద్గారాలని నియంత్రించడంలో భారత్ తన నిబద్ధతను చాటుకుంటోందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.

- భారత్, అజర్‌బైజాన్ రెండూ స్వతంత్ర భావాలు గల దేశాలని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అభివర్ణించారు.

========================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నక్సలిజం నుండి విముక్తి పొందిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రస్తుతం అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు. జగదల్‌పూర్‌లోని లాల్‌బాగ్ మైదానంలో జరిగిన “బస్తర్ దసరా ఉత్సవం-2026” కార్యక్రమంలో రాష్ట్రపతి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... బస్తర్ దసరా ఉత్సవం ఈ ప్రాంతంలోని గిరిజన సమాజాలన్నింటినీ ఏకం చేస్తుందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశంగా భారతని మార్చే ప్రయాణంలో గిరిజన యువత చురుగ్గా పాల్గొంటారన్న దృఢ విశ్వాసాన్ని ఆమె వెలిబుచ్చారు. గిరిజన పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సౌకర్యాలు కల్పించేందుకు వారిని మార్కెట్లతో అనుసంధానించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను రాష్ట్రపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ దేకా, ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

=======================

ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయడం, స్వావలంబనను ప్రోత్సహించడం వంటి విషయాలలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడం అవసరమన్నారు.

(వాయిస్ 34 సెకన్లు)

ఇదిలా ఉండగా గత పన్నెండేళ్లలో దొంగిలించబడిన 650కి పైగా పురాతన విగ్రహాలు, పురావస్తు సంపదను విదేశాల నుండి భారతదేశం తిరిగి తీసుకువచ్చినట్లు ప్రధానమంత్రి తెలిపారు. దేశ సాంస్కృతిక వారసత్వం పునరుద్ధరించబడుతోందని గుర్తు చేశారు.

=======================

దేశంలో విస్తరిస్తున్న స్వచ్ఛ ఇంధన కార్యక్రమాల ద్వారా కర్బన్ ఉద్గారాలని నియంత్రించడంలో భారత్ తన నిబద్ధతను చాటుకుంటోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. జర్మనీలో జరిగిన `బెర్లిన్ గ్లోబల్ డైలాగ్` వేదికగా క్లీన్ `ఎనర్జీ కార్బన్ ఉద్గారాల` అంశాలపై ఆయన ఈరోజు మాట్లాడుతూ... ప్రపంచ కర్బన్ ఉద్గారాలలో భారతదేశం వాటా 3 శాతం కంటే తక్కువగా ఉందని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలం పాటు పాశ్చాత్య దేశాలు తమ ఆర్థిక అభివృద్ధి కోసం బొగ్గు కర్బన్ ఆధారిత ఇంధనాలను ఉపయోగించి పర్యావరణానికి నష్టం కలిగించాయని కేంద్రమంత్రి విమర్శించారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లీన్ ఎనర్జీ కార్యక్రమాల్లో ఒకటిగా నిలుస్తోందని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

=======================

మారుతున్న యుద్ధ స్వరూపం భవిష్యత్ సంఘర్షణల వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి భారత సైన్యాన్ని సిద్ధం చేస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఆర్మీ కమాండర్ల ముగింపు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. సాంకేతికంగా శక్తివంతమైన భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న భారత సైన్యాన్ని నిర్మించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ మిషన్లలో విశేష సేవలు అందించిన ముగ్గురు భారతీయ సైనికాధికారులను రక్షణ మంత్రి సత్కరించారు.

=======================

మంచు చిరుత సంతతిని సంరక్షించడానికి భారతదేశం కృషి చేస్తోందని కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో హిమాలయాల పరిసరాలలో 718 మంచు చిరుతలు ఉన్నాయని, అంతర్జాతీయ మంచు చిరుత దినోత్సవం సందర్భంగా ఈ రోజు సామాజిక మధ్యమ పోస్టులో ఆయన చెప్పారు. వాటిలో 477 మంచు చిరుతలు ఒక్క లడఖ్‌లోనే ఉన్నట్లు వెల్లడైందని తెలియజేశారు. మంచు చిరుతల జాతిని పరిరక్షించడాకి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

విరామం

=======================

భారత్, అజర్‌బైజాన్ రెండూ స్వతంత్ర భావాలు గల దేశాలని, సమకాలీన సమస్యలపై సొంత నిర్ణయాలు తీసుకుంటాయని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. బాకులో అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ తో ప్రాంతీయ,

ప్రపంచ పరిణామాలపై జైశంకర్ ఈరోజు చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ చర్చలలో భవిష్యత్‌ని దృష్టితో ఉంచుకుని ద్వైపాక్షిక సంబంధాలలోని వివిధ అంశాలపై ఇరుపక్షాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయని తెలిపారు. భారత్, అజర్‌బైజాన్‌ల మధ్య సాంస్కృతికపరంగా సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. ఇరు దేశాలు ఒకరి విలువలను మరొకరు గౌరవించుకుంటాయని, ఇది సమకాలీన భాగస్వామ్యం దిశగా పనిచేయడానికి మంచి పునాది వేస్తుందని జై శంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

పాకిస్థాన్ లో మైనారిటీల పట్ల అక్కడి పాలకులు వ్యవహరిస్తున్న తీరును ఐక్యరాజ్య సమితిలోని భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి భావికా మంగళానందన్ విమర్శించారు. మత స్వేచ్ఛపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి నజీలా ఘనియా రూపొందించిన మధ్యంతర నివేదికపై ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాకిస్థాన్ లో మైనారిటీల సంఖ్య తగ్గిపోతోందని, వారి హక్కులకు భంగం కలుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. 1999 కార్గిల్ యుద్ధంలో మరణించిన తమ సైనికుల మృతదేహాలను గుర్తించడానికి కూడా పాకిస్థాన్ నిరాకరించడాన్ని ఆమె గుర్తు చేశారు. ఆనాడు భారత సైన్యం పలువురు పాకిస్తానీ సైనికులను సైనిక లాంఛనాలతో ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం ఖననం చేసిందని తెలిపారు. తమ దేశంలో మైనారిటీలకు భద్రత కల్పించలేని పాకిస్తాన్ కి భారతదేశాన్ని విమర్శించే అర్హత లేదని ఆమె స్పష్టం చేశారు.

========================

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడటంతో రాబోయే రోజులలో తుఫానుగా మరే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) అంచనా వేసింది. అల్పపీడనం క్రమంగా బలపడి.. పశ్చిమవాయువ్య దిశగా ఉత్తర ఆంధ్రప్రదేశ్, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీరాల వైపు కదులుతుందని పేర్కొంది. ఐఎండి అంచనా ప్రకారం అల్పపీడనం రేపటికి వాయుగుండంగా, ఎల్లుండికి తీవ్ర వాయుగుండంగా మారి ఈ నెల 26వ తేదీ ఉదయానికి తుఫానుగా బలపడే అవకాశం ఉంది. దీంతో ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశాలలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ కొన్ని చోట్ల విస్తారంగా, మరి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎమ్‌డి పేర్కొంది. మత్స్యకారులు ఈ సమయంలో సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

========================

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన ఆసియన్ పారా గేమ్స్‌ల్లో భారత పారా క్రీడాకారులు మొత్తం 114 పతకాలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు ఉన్నాయి. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌లో సుమిత్ అంటిల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, మహేంద్ర గుర్జర్ రజతం, సందీప్ సంజయ్ సర్గార్ కాంస్య పతకాలను సాధించారు. తద్వారా ఈ విభాగంలో భారత్ పోడియంపై మూడు స్థానాలను కైవసం చేసుకుంది.

========================

వడోదరలో జింబాబ్వేతో ఈరోజు జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత మహిళల జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 198 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ప్రతీక రావల్ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ 64 పరుగులు సాధించింది. ఈ విజయంతో భారత్ 3 వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

========================
========================